క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మినాజ్‌పాషా

తుగ్గలి: గర్భిణులు విధిగా ఆహార నియమాలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి మినాజ్‌పాషా సూచించారు. పగిడిరాయి పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ యోజన పథకంలో భాగంగా శుక్రవారం గర్భిణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించు కోవాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం సురక్షితం అన్నారు.

గండి పూడ్చివేత



గండిని పూడ్చివేసిన దృశ్యం

వెల్దుర్తి: మల్లెపల్లె పంపింగ్ స్టేషన్ సమీపంలో హంద్రీనీవా ప్రధాన కాలువకు పడిన గండి పూడ్చివేత పనులు పూర్తయ్యాయి. ఈనెల 4న కాలువకు గండి పడి దాదాపు 250 ఎకరాల పంటపొలాలను ముంచెత్తిన విషయం తెలిసిందే. దీంతో కాలువ నీటి పంపింగ్‌ను అధికారులు ఆపేశారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చివేసినట్లు హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్–2 ఈఈ సురేశ్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



పూజలందుకుంటున్న నరసప్ప స్వామి

ఆస్పరి: మండలంలోని కై రుప్పల గ్రామంలో శుక్రవారం నూతన ఆలయ గోపుర కలశ స్థాప న, నరసప్ప స్వామి, వినాయక, నాగదేవతలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు కలిసి కొత్తగా నరసప్ప స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో పురోహితులు గంగాధర య్య స్వామి, రుద్రయ్య స్వామి ఆధ్వర్యంలో గంగ పూజ, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు నరసప్ప స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఆస్పరి సీఐగా మస్తాన్‌వలి



బాధ్యతలు స్వీకరిస్తున్న మస్తాన్‌వలి

ఆస్పరి: ఆస్పరి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీఐగా మస్తాన్‌వలి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ హనుమంతప్ప చిత్తూరు జిల్లాకు బదిలీ కాగా తిరుపతిలోని బాకరాపేట సీఐగా పనిచేస్తున్న మస్తాన్ వలి ఆస్పరికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసకుంటామన్నారు.

మద్దికెరలో భారీ వర్షం



కుంటను తలపిస్తున్న పంట పొలాలు

మద్దికెర: మద్దికెరలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. 52.8 వర్షపాతం నమోదు కావడంతో పొలాలు నీటి మునిగాయి. దాదాపు నెల పాటు వర్షం దోబూచులాడిన వరుణుడు కరుణించడంతో రైతులు ఊరట చెందారు. రైతులు ముందస్తు వర్షాలకు సాగైన జొన్న, కంది పంటలకు వర్షాలు ఊపిరి పోశాయి.

ఆశాజనకంగా కొర్ర పంట



అమకతాడు వద్ద సాగు చేసిన కొర్ర పంట

కృష్ణగిరి: ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన కొర్ర పంట ఆశాజనకంగా ఉంది. వర్షాలు అంతంత మాత్రంగానే ఉన్నా పంట ఏపుగా వచ్చింది. దీంతో మరో 20 రోజుల్లో అన్నదాతల చేతికి మొదటి పంటగా కొర్ర పంట రానుంది. మండల వ్యాప్తంగా దాదాపుగా 420 ఎకరాల్లో కొర్ర పంట సాగైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. పంట ఆశాజనకంగా ఉండటంతో మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి కుట్ర

తుగ్గలి(పత్తికొండ): విజయవాడ నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చ మూకలు దాడి చేయడం సిగ్గుచేటని ఎంపీపీ నారాయణదాసు ఖండించారు. ఈ ఘటనను వ్యతిరేకిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు పట్టణంలో నల్ల కండువాలతో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. మహనీయుల విగ్రహాలను కూల్చివేసి, దాడులకు పాల్పడుతూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. చివరకు అంబేడ్కర్ మహా శిల్పాన్ని ధ్వంసం చేసేందుకే బరితెగించారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బనగాని శ్రీనివాసులు, ఎంఎస్ మధు, బళ్లారి మోహన్‌కృష్ణ, నాగరాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండ: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఆలూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జగనన్న చేసిన మంచిని చెరపలేరు

ఆలూరు: శిలాఫలకాలపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును చెరపగలరేమోగాని, ఆయన ప్రజలకు చేసిన మంచిని, జనం గుండెల్లో జగనన్నపై ఉన్న అభిమానాన్ని తుడిపేయలేరని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. విజయవాడలోని భారత రాజ్యాంగ రూప శిల్పిపై మహా విగ్రహం ధ్వంసానికి పాల్పడడాన్ని నిరశిస్తూ స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, అంబేడ్కర్ వాదులు నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈరన్న, అరికెర వీరేష్ తదితరులు మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఆయన కుమారుడు నారా లోకేశ్ కక్షపూరితంగా రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. విధ్వంసాలు, దాడులు, హత్యలతో చంద్రబాబు పాలన సాగుతుందని, ఆ పార్టీకి ప్రజాగ్రహం తప్పదన్నారు. అంబేడ్కర్ మహా విగ్రహం ధ్వంసానికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు మరకట్టు ఎల్లప్ప, బాబు, కిశోర్, వీరేష్, రాజు, కురువెళ్లి శివ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై అక్కసుతో విధ్వంసానికి యత్నం



రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించడం దారుణం. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయ మహా శిల్పం పేరుతో భారీ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని జీర్ణించుకోలేక ధ్వంసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. దళితులపై అక్కసుతో విగ్రహ ధ్వంసరచనకు పూనుకున్నారు. ఇందుకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి

– సాయిపోగు నెట్టప్ప, మొలగవల్లి గ్రామం

నిందితులను కఠినంగా శిక్షించాలి



రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి ప్రయత్నించిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రజాస్వామ్యానికి దిక్సూచి లాంటి అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనంలో ధ్వంసానికి పాల్పడడం దారుణం. రూ.404 కోట్లతో దేశానికే తలమానికంగా విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై దాడిని రాజద్రోహంగా పరిగణించాలి.

–గుడిసె మహానంది, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, ఆస్పరి

అరాచకం రాజ్యమేలుతోంది



కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మంచిది కాదు. రెండు నెలల పాలనలో దళితులపై దాడులు, వేధింపులు ఎక్కువయ్యాయి. ఎక్కడ చూసినా అరాచకం రాజ్యమేలుతోంది. రాజ్యంగ నిర్మాత అంబేడ్కర్ మహా శిల్పం ధ్వంసానికి పూనుకోవడం చూస్తే వారికి ఆ మహానీయుడి పట్ల ఉన్న గౌరవం ఎంతటిదో అర్థమవుతోంది. ఇలాంటి విధ్వంస చర్యలు మానుకుని ప్రజలకు మంచి పాలన అందించేందుకు కృషి చేయాలి.

– కెంచప్ప, గజ్జహళ్లి

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి హేమ

ఆలూరు రూరల్: యువత మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి హేమ మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడి చదువులకు దూరం కావొద్దని చెప్పారు. చిన్నతనం నుంచే మత్తుకు బానిసైతే భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న గాయత్రీ మాత

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వర్షం కోసం మారెమ్మవ్వకు పూజలు

ఆస్పరిలో వర్షం కురవాలని భక్తులు మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి గంగ, ఆకుపూజ, కుంకుమార్చన, మంగళహారతులు పట్టారు. గ్రామం నలుదిక్కుల పొరమేరల్లో మారెమ్మవ్వ వారి నైవేద్యంను పొలి చల్లారు. ఇలా చేస్తే వర్షాలు కురుస్తాయని గ్రామస్తుల నమ్మకం. అలాగే గ్రామంలో కొలువైన మూడు ముఖాల అమ్మవారికి యువకులు 108 బిందెల నీటితో జలాభిషేకం చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

హొలహర్వి: మండలంలోని మాచనూరు గ్రామంలో శుక్రవారం మహాగణపతి, కుమారస్వామి, నందీశ్వర, పార్వతీ పరమేశ్వర లింగ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా చేపట్టారు. గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

దేవనకొండ: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున ఒంటి గంట నుంచే బొడ్రాయి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ ఆడబిడ్డలు ఒడిబియ్యంతో ఆలయానికి చేరుకుని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నగరడోణలో ధ్వజారోహణం

చిప్పగిరి: మండలంలోని నగరడోణ గ్రామంలో వెలసిన సుంకులమ్మ దేవాలయంలో ధ్వజారోహణ కార్యక్రమం శుక్రవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు తమ ఆడబిడ్డలకు ఒడి బియ్యం పోసి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున తరలివచ్చిన సమీప గ్రామ ప్రజలకు, భక్తులకు అన్నదానం చేశారు.

బంగారం గొలుసు అప్పగింత



బాధితురాలికి బంగారు గొలుసు అప్పగిస్తున్న సీఐ జయన్న

తుగ్గలి(పత్తికొండ): పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి ఓ వృద్ధురాలు పోగొట్టుకున్న బంగారం గొలుసును అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవనకొండలో ఉన్న బంధువులను కలిసేందుకు గురువారం బస్సులో బయలుదేరిన ఆదోనికి చెందిన వృద్ధురాలు మహదేవమ్మ వెంట తెచ్చుకున్న సంచిని బస్సులోనే మరిచిపోయింది. అందులో బంగారు గొలుసు, పట్టువస్త్రాలు ఉండడంతో ఆందోళనకు గురైంది. వెంటనే ఆమె పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ జయన్న పోలీసులను అప్రమత్తం చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలు ప్రయాణించిన బస్సు తిరిగి ఆదోని బయలుదేరిన విషయం లొకేషన్ ద్వారా తెలుసుకున్న పోలీసులు అనుసరించారు. బిణిగేరి వద్ద బస్సును ఆపి అందులో ఉన్న సంచిని స్వాధీనం చేసుకున్నారు. రెండు తులాల బంగారు గొలుసును బాధితురాలికి సీఐ అప్పగించారు. సీఐతోపాటు పోలీసులకు మహదేవమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆలూరు ఎస్ఐగా నరసింహులు



సీ.వీ నరసింహులు

ఆలూరు రూరల్: ఆలూరు ఎస్ఐగా సీ.వీ నరసింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఓబులేసు కర్నూలు వీఆర్‌కు వెళ్లారు. చిత్తూరు జిల్లా సోమల మండల ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నరసింహులు బదిలీపై ఆలూరుకు వచ్చారు.

దేశ సంపదను లూటీ చేస్తున్న కేంద్రం



పత్తికొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

తుగ్గలి(పత్తికొండ) : కార్పొరేట్ వ్యవస్థలకు అనుగుణంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య విమర్శించారు. క్విట్ కార్పొరేట్ నినాదంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ బీజేపీ మూడో సారి అధికారం చేపట్టిన తర్వాత మరింత ఉత్సాహంతో పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలకు నేషనల్ మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ రంగసంస్థలను అమ్మేస్తోందన్నారు. రైతాంగం తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిందని, ప్రజల సంక్షేమాన్ని కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేట్లను తరిమికొడదామని, బడా కంపెనీల నుంచి వ్యవసాయాన్ని కాపాడుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, కారన్న, నెట్టికంటయ్య, రంగన్న, గురుదాస్, జయమ్మ, సుంకమ్మ, రంగమ్మ, లక్ష్మిదేవి, గిడ్డయ్య, నాగిరెడ్డి, మద్దిలేటి, పులికొండ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తుగ్గలి(పత్తికొండ): స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్న శ్రీనివాసులు కూతురు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చికిత్స నిమత్తం ఈవో నరసింహులు, పంచాయతీ సిబ్బంది సేకరించిన నగదును(రూ. 21,800) శుక్రవారం శ్రీనివాసులుకు అందజేశారు.

మహనీయులను స్మరించుకోవాలి

తుగ్గలి(పత్తికొండ): స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసిన మహనీయులను నిరంతరం స్మరించుకోవాలని రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కో కన్వీనర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో పత్తికొండలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఆగష్టు 13నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బ్రహ్మయ్య, కార్యక్రమ ఇన్‌చార్జ్ కరణం నరేష్, మండల అధ్యక్షులు శంకరయ్య ఆచారి, నాయకులు రామ్మోహన్, మల్లికార్జున, నాగేష్, రామాంజినేయులు, ప్రతాప్, పాల్గొన్నారు.

12 నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

తుగ్గలి : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 12నుంచి 14వరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

కొతలల్లో తేడాలొస్తే రికవరీ చేస్తాం

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి కొలతల్లో తేడాలు వస్తే రికవరీకి ఆదేశిస్తామని ఎస్ఆర్‌పీ విజయభాస్కర్ తెలిపారు. మండల పరిధిలోని అమకతాడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ బోయ సర్వేశ్వరి అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మస్టర్లలో కూలీల సంతకాల విషయంతో తప్పులు చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఈసీ చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు, డీఆర్‌పీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రోడ్డు సొగసు చూడ తరమా!



హొళగుందలో చిత్తడిగా మారిన ప్రధాన రహదారులు





ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

- హొళగుందలో చినుకు పడితే చిత్తడే

హొళగుంద : చిన్నపాటి వర్షానికే మండల కేంద్రంలోని రోడ్లు చిత్తడి చిత్తడిగా మారి బురద కుంటలను తలపిస్తున్నాయి. వాల్మీకీ సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు, అలాగే పేట బసవేశ్వరస్వామి ఆలయ తదితర ప్రధాన రోడ్లు బురదమయమవుతుండటంతో అడుగు వేయలేని పరిస్థితి. ఒకవేళ ఎవరైనా ధైర్యం చేసి నడవడానికి ప్రయత్నిస్తే కాలుజారి కిందపడాల్సిందే. ఇక ద్విచక్ర వాహనదారులు గత్యంతరం లేక వెళ్దామని ప్రయత్నించినా రెండు కాళ్లు కింద పెట్టుకొని నెమ్మదిగా వెళ్లాల్లి. అయినా పలువురు జారి కిందపడుతున్నారు. వాల్మీకి సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు ఎన్నో ఏళ్ల క్రితం తారు రోడ్డుగా ఉన్న రోడ్డు నేడు గుంతలు పడి, రాళ్లు తేలి అధ్వానంగా మారింది. వర్షకాలంలో గుంతల్లో నీరు నిలిచిపోయి కుంటలను తలపిస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దికెర : మద్దికెరలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రఫీక్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కృష్ణగిరి: సాధారణ మరమ్మతుల నేపథ్యంలో కృష్ణగిరి, లక్కసాగరం గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మద్దిలేటి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సూచించారు.

పంటల నమోదు పరిశీలన

దేవనకొండ: మండలంలో జరుగుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఏఓ సురేష్ బాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఖరీఫ్‌లో 26 వేల హెక్టార్లలో రైతులు పంటలను సాగుచేశారన్నారు. పంటల నమోదు కార్యక్రమం మొదలైందని, రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి సాగుచేసిన పంటల వివరాలను అందజేయాలన్నారు.

చీడపీడలను నివారించాలి

పత్తిలో గులాబీరంగు పురుగు నివారణకు ఎకరానికి 20 పసుపు రంగు, 20 నీలి రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పురుగు ఉధృతిని బట్టి ఎకరానికి 15 లింగాకర్షణ బుట్టలు పెట్టాలన్నారు. తద్వారా గులాబీరంగు తల్లి పురుగు సంతతిని తగ్గించవచ్చన్నారు. అలాగే వేరుశనగ పంటకు ఎకరానికి 200 కేజీల జిప్సం వేయాలని రైతులకు సూచించారు. వరి వేసే రైతులు కచ్చితంగా కాలిబాటలు తీసుకోవాలన్నారు.

ఎంపీడీఓ విజయలక్ష్మి బదిలీ

తుగ్గలి: సాధారణ ఎన్నికల సమయంలో తుగ్గలి ఎంపీడీఓగా వచ్చిన విజయలక్ష్మి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆమె శుక్రవారం రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, ఏపీఓ రామకృష్ణ, ఉపాధి సిబ్బంది ఆమెను సన్మానించి వీడ్కోలు పలికారు.

నెల్లిబండలో డ్రైడే - ఫ్రైడే

దేవనకొండ: మండలంలోని నెల్లిబండ గ్రామంలో శుక్రవారం డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాన్ని దేవనకొండ హెల్త్ సూపర్‌వైజర్ రంగస్వామి, సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల ఇంటి పరిసరాలను పరిశీలించారు. డ్రమ్ములు, నీటి తొట్టెల్లో చాలా రోజులుగా నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. వారు మాట్లాడుతూ.. నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేయరాదన్నారు. రాత్రివేళల్లో దోమకాటుకు గురికాకుండా దోమతెరలను వాడాలన్నారు. 104 సేవలపై ప్రజలకు వివరించారు. గ్రామంలో ఒక హై రిస్క్, టీబీ కేసును పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి చక్రాలు ఎరుగని పల్లెలు

- మండలంలో నేటికీ బస్సు సౌకర్యం లేని గ్రామాలు



బంటణహాలు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం ఇస్తున్న ప్రజలు

చిప్పగిరి: 'బస్సు చక్రం రాష్ట్ర ప్రగతికి చిహ్నం' అనే మాట బస్సులో కిటికీల దగ్గర రాసే రాతలకే పరిమితం అయ్యింది. నేటికీ బస్సు సౌకర్యం లేని గ్రామాలు ఉన్నాయంటే అవి అభివృద్ధికి ఎంతదూరంలో ఉన్నాయో అవగతమవుతుంది. మండలంలో మొత్తం 16 గ్రామాలు ఉన్నాయి. అయితే గంతకల్లు – ఆలూరు ప్రధాన రహదారిలో వచ్చే పల్లెటూర్లు చిప్పగిరి, కుందనగుర్తి, బెల్డోణ, నేమకల్లు, రామదుర్గం గ్రామాల మీదుగా బస్సు సర్వీసులు ఉండగా కుందనగుర్తి, నేమకల్లు, రామదుర్గం గ్రామాల ప్రజలు బస్సు కోసం 2 కి.మీ నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే మండలంలోని ఏరూరు, డేగులహాలు గ్రామాలకు బస్సు సర్వీసులు అంతంత మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగిలిన బంటణహాలు, గుమ్మనూరు, కాజీపురం, కొట్టాల, సంఘాల, దౌల్తాపురం, నంచర్ల, తిమ్మాపురం తదితర రగామాలకు అసలు బస్సు సర్వీసులు ఏళ్లనాటి నుంచి అందుబాటులో లేవు. ఆయా గ్రామాల ప్రజల బస్సు సర్వీసు ఎరుగరు. ఇదిలా ఉండగా శుక్రవారం బంటణహాలు వాసులు తమ గ్రామానికి బస్సు సర్వీసు నడపాలని కోరుతూ గంతకల్లు బస్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. బస్సు సౌకర్యం లేనందున విద్యార్థులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. బస్సు సర్వీసు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వ్యవసాయంపై కేంద్రం చిన్నచూపు



ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆస్పరి: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై చిన్న చూపు చూస్తోందని రైతు సంఘం నాయకులు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై శుక్రవారం ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆరోపించారు. వ్యవసాయ రంగంలో కార్పొరేటీకరణను దేశంలోని రైతు సంఘాలన్నీ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన వాగ్దానాలు ఏమాత్రం అమలు చేయడం లేదన్నారు. 2024 కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, సాగు నీటి ప్రాజెక్టులకు తీవ్ర అన్యాయం జరిగిందని ధ్వజమెత్తారు. జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న వేదావతి, నగరడోణ, గుండ్రేవుల, హంద్రీ – నీవా ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2023 రబీలో నష్టపోయిన పప్పు శనగ రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. జింకల బారి నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు రంగస్వామి, రంగప్ప, జయన్న, మునిస్వామి, నారాయణ, కుమార్, రమేష్, వీరేష్, మహానంది, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ బదిలీ

తుగ్గలి : స్థానిక గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ వెంకప్ప పత్తికొండ క్లస్టర్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రిలీవ్ కాగా, ఏపీఓ రామకృష్ణ, ఉపాధి సిబ్బంది సన్మాంచి వీడ్కోలు పలికారు.